

మూలం:
మాస్సిమో బొంటెంప్ లై

# ప్రతిబింబం

నాకు అద్దంతో కలిగిన ఒక అనుభవం మీకు చెప్పాలి. ఎద్దేవా చేస్తారేమో. అయినాసరే, ఓపికగా వింటే చెబుతాను.

జీవితంలో ఎక్కువ భాగం నేను అద్దంముందు గడుపుతానని ఎవరైనా అనుకోవడం నాకు ఇష్టం ఉండదు. నేను ఆ వస్తువును ఒక వస్తువుకన్నా మిన్నగా చూసుకుంటాను. నాకు అదొక మామూలు వస్తువు కాదు. నా ప్రతిబింబాన్ని నాకు చూపిస్తుంది. నాలో కొత్త ఆలోచనల్ని రేకెత్తిస్తుంది.

ఓ రోజు ఉదయం బాగా పొద్దెక్కాక మా ఇల్లుగలావిడ నన్ను నిద్ర లేపి, టెలిగ్రాం చేతి కిచ్చింది. ఇల్లుగలావిడ అంటే నా భార్య అనుకునేరు. ఇంటి స్వంతదారు. వృద్ధ మహిళ.

నేను నిద్రలోంచి బయటపడి, నన్ను నేను సంభాళించుకుని టెలిగ్రాం చదివే ప్రయత్నం చేశాను. అది వియన్నానుండి వచ్చింది. సరిగ్గా నాకే వచ్చింది. అంటే అది నన్ను ఉద్దేశించి పంపిందే....చిరునామాలో తప్పు లేదు. సరిగానే ఉంది. ఆ టెలిగ్రాం నాదే నని నిర్ధారించుకున్నాక అందులోని విషయం చదివాను.

"శ్రీ మాస్సిమో మహాశయా!

దయచేసి ఎల్లుండి రోమ్‌లోనే ఉండండి. మనం మళ్లీ కలుసుకునేదాకా ఉండండి. నా పునరాగమనం కోసం వేచి ఉండండి.

ఇట్లు
మస్సిమో"

రెండు నెలల క్రితం పదిహేను రోజులపాటు నేను వియన్నాలో ఉన్నాను. అప్పుడు కలిసినవాళ్లందరినీ ఓసారి గుర్తు చేసుకున్నాను. టైబర్ అనే వృద్ధమిత్రు డుండేవాడు. హంగరీ దేశస్థుడు. అలాగే ఫ్రిట్జ్, రిచర్డ్, జాన్ మొదలైనవాళ్లంతా ఉండేవారు. మస్సిమో అనే పేరుతో వియన్నాలో నా కెవరూ పరిచయం లేరు; నేను తప్ప. ఇక నిర్ధారించుకో దగ్గది మరేం లేదు. వియన్నాలో నాకు తెలిసిన మస్సిమో నేను తప్ప మరెవరూ లేరు. అయితే, మరి టెలిగ్రాం? నాకు నేను పంపుకున్నదేనా?! ఎస్...విషయం నాకు అర్థమైంది. కాని, కథ చదివే పాఠకులకు బోధపడి ఉండదుకదా. అందుకే వివరంగా చెబుతాను. టెలిగ్రాంకు సంబంధించి కొన్ని విషయాలు...విషయాలన్నీ కాకపోయినా, ఒక్క విషయం మాత్రం తప్పక చెబుతాను.

ఓ రోజు నా వస్తువులన్నీ మళ్లీ తీసి మళ్లీ పెట్టి, మళ్లీ తీసి మళ్లీ పెట్టి సర్దుకుంటున్నాను. ఎందుకంటే నా గొడుగు కనబడలేదు. ఏదైనా ఒక వస్తువు కనబడనప్పుడు చూసిందే చూసి, సర్దిందే సర్ది పెట్టుకుంటూ ఉంటాంకదా? అది మానవుల బలహీనత. మొదట ఎప్పుడూ పెట్టేచోట...అంటే గదిమూల చూశాను. గొడుగు అక్కడ లేదు. గదంతా చూశాను. ఊహూ(...లేదు. గొడుగు పోయిందని నిర్ధారించుకున్న తరువాత, బిజినెస్ పనిమీద బయటికి వెళ్లిపోయాను. గొడుగుకన్నా ముఖ్యమైన వస్తువులు జీవితంలో ఎన్నో పోగొట్టుకుంటూ ఉంటాం. ఇక బెంగెందుకూ?!

పని ఒత్తిడివల్ల రెండ్రోజులు గొడుగు సంగతే మరిచిపొయ్యాను. ఆ తర్వాత టెలిగ్రాం వచ్చింది..."ఈ రోజు రాత్రికి వస్తున్నాను....ఇట్లు, గొడుగు".

టెలిగ్రాం గురించి కాసేపు ఆలోచించి, ఎలాగూ వస్తోందికదా అని మనశ్శాంతిగా నిద్రపోయాను. మరునటి ఉదయం లేవగానే గొడుగు గదిమూలకు కనిపించింది.

అవును...అది నా గొడుగే. కొన్ని విషయాలు సైన్సుకి ఇంకా అందడం లేదు. కొన్ని వస్తువులు ఉన్నట్టుండి ఉన్నచోటే మాయమవుతాయి. జాగ్రత్తగా చాలాసేపు వెతికితే దొరుకుతాయి. అది వేరే విషయం. కాని, పోయిన వస్తువు తన పునరాగమనాన్ని తెలియజేయడం మాత్రం విడ్డూరంగా ఉంది. అందువల్ల నే నిచ్చిన టెలిగ్రాం నాకు రావడంలో వింతే లేదని

## రచయిత గురించి...

ఇటాలియన్ రచయిత మాస్సిమో బొంటెంప్ లై 1878లో కొమెలో పుట్టారు. రచనే వృత్తిగా బతికారు. అన్ని సాహిత్య ప్రక్రియల్లో కృషి చేశారుకాని, కథా రచయితగా గొప్ప గుర్తింపు పొందారు. La Donna dei Miei Songni(నా కలల రాణి) శీర్షికతో ప్రచురితమైన కథాసంపుటిలో ఈ కథ ఉంది. సున్నిత హాస్యంతో సాగిన ఈ కథలో లోతుగా తరచి చూస్తే మానవ వ్యక్తిత్వం గురించి అనేక విషయాలు అవగత మవుతాయి. మనిషి...ప్రతిబింబం రెండూ ముఖ్యమైనవే. ప్రతిబింబ మంటే బహుశా వ్యక్తిత్వం కావచ్చు. మనిషి కనబడతాడు. వ్యక్తిత్వం కనబడదు. అయితే, మనిషిని చూసే వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవాలి. ఒక్కోసారి మనిషి కదలకుండానే అతని వ్యక్తిత్వం ఎన్నో మంచి పనులు చేయిస్తుంది. ప్రతిబింబం పడని మనుషులంటే వ్యక్తిత్వం కోల్పోయిన మనుషులని రచయిత సుతిమెత్తగా చెబుతున్నారేమో ఆలోచించాలి.

ఒక భాషకు, ఒక ప్రాంతానికి పరిమితమైపోకుండా మొత్తానికి మొత్తంగా మానవ నైజం చుట్టూ చిత్రంగా, అద్భుతంగా అల్లిన కథ...'ప్రతిబింబం'.

అనిపిస్తోంది. ఇక్కడ...కొంచెం వెనక్కి వెళ్లి పాఠకులకు కొన్ని పాత విషయాలు చెప్పాలి.

రెండు నెలల క్రితం వియన్నాలో అద్దంముందు నిలబడి టై కట్టుకుంటున్నాను. అప్పుడు రోమ్‌కు తిరిగివచ్చే ప్రయత్నంలో రైల్వే స్టేషనుకు బయలుదేరుతున్నాను. ఆరోజు నగరంలో రాజకీయ ఊరేగింపులు ఉధృతంగా సాగుతున్నాయి. నగరమంతా అలజడిగా, అల్లకల్లోలంగా ఉంది. అయినా, నా ప్రయాణం మానుకో దలుచుకోలేదు. తయారవుతున్నాను. నేను అద్దంముందు నిలబడి టై కట్టుకుంటున్నానని చెప్పానుకదా? అప్పుడే అకస్మాత్తుగా ఏదో పేలింది. ఇల్లంతా దద్దరిల్లి పోయింది. నా ఎదురుగా ఉన్న అద్దం ఉన్నఫళంగా పగిలి, ముక్కలుముక్క లైంది. పేలింది బాంబని గుర్తించాను. అద్దం లేకుండానే టై సరిచేసుకుని బ్యాగ్ పుచ్చుకుని స్టేషను చేరాను.

వియన్నా వదిలేసి, రెండు రోజుల తర్వాత రోమ్ నగరం చేరాను. బాగా అలసిపోయి, రాత్రి పొద్దుపోయాక గదికి చేరుకున్నాను. గబగబా బట్టలు మార్చుకుని పడుకుని నిద్రపోయాను. మరునాటి ఉదయం నిద్ర లేచి దినచర్య ప్రారంభించాను. గడ్డం గీసుకోవడానికి అద్దం ముందు నిలబడ్డాను. షేవింగ్ బ్రష్ ఓ చేతిలో, తుండుగుడ్డ మరో చేతిలో తీసుకుని అద్దంముం దున్నాను. కాని, ఆశ్చర్యం. అద్దంలో నేను లేను. అంటే నా ప్రతిబింబం లేదు. నురగతో ఉన్న బ్రష్షూ, మెలిపెట్టిన తుండూ, ఇంకా గదిలోని ఇతర వస్తువులు అన్నీ అద్దంలో కనిపిస్తున్నాయి. నేనే కనబడడం లేదు. నా ముఖం, నా రూపు, నా ఛాయ....ఏదీ లేదు. ఏమైందీ?

విషయం గ్రహించాక పగలబడి నవ్వాను. అద్దం ఉపయోగించేవా రందరికీ అనుభవమే. ముఖ్యంగా స్త్రీలకు! చూస్తున్న అద్దంలోంచి పక్కకు జరిగి రావాలంటే ఎంతో బాధ. తమ ప్రతిబింబాన్ని, తమ ప్రపంచాన్ని అద్దంలోంచి తొలగించడానికి ఎవరూ ఇష్టపడరు. తొలగించాల్సి వచ్చినప్పుడు ఒక రకమైన నిస్పృహకు గురవుతారు. మనకూ, మన ప్రతిబింబానికి మధ్య ఎడబాటు సహించరానిది. కాని, ఇక్కడ అద్దంలో నా ప్రతిబింబమే లేదు.

ఆ రోజు వియన్నాలో ఏమైంది? బాంబు పేలి నా ఎదురుగా అద్దం ముక్కలైంది. నా ప్రతిబింబం అద్దంలో ఉండిపోయింది. అద్దం ముక్కలు కాకముందే నా ప్రతిబింబాన్ని పక్కకు తొలగించాల్సింది. కాని, అప్పుడు అలా వీలు కాలేదు. అద్దంలో నా ప్రతిబింబం ముక్కలై ఉండొచ్చు. ప్రయాణపు హడావుడిలో నే నా సంఘటనకు అంతగా ప్రాముఖ్యం ఇవ్వలేదు. కాని, దాని ఫలితం రెండ్రోజుల తర్వాత ఇక్కడ గమ నించాను. ఆవిధంగా నా ప్రతిబింబం నానుండి విడిపోయి సుమారు రెండు నెలలైంది. ఈ రెండు నెలలనుండి అద్దంలో నా ప్రతిబింబం కనిపించడం లేదు. మొదట్లో కొంచెం ఇబ్బందిగానే ఉండేది. కాని, ఇప్పుడు అలవాటు పడ్డాను. ప్రతిబింబమే

**అనువాదం: డాక్టర్ దేవరాజు మహారాజు**

లేనప్పుడు ఇక అద్ద మెందుకూ? అద్దం తీసి ఇనప్పెట్టెలో పడేశాను.

ఇప్పు డిక నేను తీసుకోవాల్సిన జాగ్రత్త ఒక టుంది. నేను అద్దంముందు నిలుచున్నప్పుడు ఎవరూ నన్ను చూడకూడదు. వీథుల్లో, కేఫేల్లో, ఇరుకు ఇండ్లలో అద్దం ముందునుండి నేను వెళుతున్నప్పుడు నేను కొంచెం జాగ్రత్తగా మసలుకోవాలి. లేకపోతే జనానికి అదో పెద్ద విడ్డూరంగా తోస్తుంది. ఏమిటీ, ఎందుకు....అని ఆరా తీస్తారు. నే నేదో సర్ది చెప్పాల్సి వస్తుంది. వాళ్లది నమ్మరు. లేనిపోని గొడవ. ఎందుకొచ్చి నట్టు? నేను పోగొట్టుకున్నది పెద్దగా ఏమీ లేదు. ఇంక నా కెందుకు బాధ? అయినా, ఎనిమిది. రోజులక్రితం నా పేరుతో వచ్చిన టెలిగ్రాం నా ప్రతిబింబం ఇచ్చిందని నేను కొంచెం ఆలస్యంగా గ్రహించాను. ఇప్పుడు నా పాఠకులుకూడా గ్రహించే ఉంటారు. సారాంశం ఏమిటంటే, నా ప్రతిబింబం నా దగ్గరికి తిరిగివస్తోంది. శుభస్య శీఘ్రం.

తిరిగి వచ్చేది నా ప్రతిబింబమే అయినా, నేను పెద్దగా ఆసక్తి కనబరచలేదు. ఆత్రంగా అద్దంలోకి చూసి అందులో నేను కనబడుతున్నానా అని వెతుక్కోలేదు. అద్దంలో నా ప్రతిబింబం వెతుక్కున్నానంటే దాని కేదో నేను పెద్ద విలువ ఇస్తున్నానని అది పొంగిపోవచ్చు. నా ప్రతిబింబం లేకుండా నేను ఉండలేకపోతున్నానా? అన్నీ సజావుగానే సాగుతున్నాయి కదా? అలాంటప్పుడు నేను నా ప్రతి బింబం కోసం బెంగపెట్టుకున్నట్టు ఎందుకు తహతహలాడాలి? నా బెంగ చూసి ప్రతిబింబం ఎందుకు చంకలు గుద్దుకోవాలి?

టెలిగ్రాం అంది ఎనిమిది రోజులయ్యింది గనక, నా ప్రతిబింబం ఎనిమిదిరోజుల క్రితమే వియన్నా నుండి ఇక్కడికి బయలుదేరి ఉంటుంది. నా దగ్గరికి చేరి కూడా నాలుగురోజులై ఉంటుంది. కాని నిన్నటి దాకా నేను దాన్ని కావాలనే పట్టించుకోలేదు. నిన్ననే ఇనప్పెట్టెలోంచి అద్దం తీసి, సరికొత్త పాటొకటి హమ్ చేస్తూ, మధ్య మధ్యలో ఈలవేస్తూ తీసుకెళ్లి స్నానాలగదిలో యధాతథంగా అమర్చాను. అయితే అద్దంవైపు కన్నెత్తయినా చూడలేదు.

కదలకుండా మెదలకుండా అద్దంలోకి చూడకుండా హుందాగా, కాలరూ టై సరిచూసుకున్నాను. ప్రతిబింబంపట్ల నాకున్న ముభావాన్ని వ్యక్తం చేస్తూ ఎందుకో ఓ క్షణాన అనుకోకుండా అద్దంలోకి చూశాను. అక్కడ నా ప్రతిబింబం కనిపించింది.

అవును! అదే...సరిగ్గా అదే! నా ప్రతిబింబమే!!

ఎంతోదూరం ప్రయాణించి వచ్చిన అలసటగాని, నామీద కోపం గానీ, చిరాకు గానీ ప్రదర్శించలేదు. పైగా నాలాగే నిశ్శబ్దంగా, హుందాగా ఉంటూనే... నన్ను లక్ష్యం చేయనట్లు నాలాగే ముభావంగా ఉంది. ■